క్లుప్తంగా

చురుగ్గా ఇళ్ల నిర్మాణం



థర్డ్ ఆప్షన్‌లో నిర్మాణం అవుతున్న ఇళ్లు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని పేదల కోసం ప్రభుత్వం థర్డు ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించడానికి ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా స్థానిక ఈటీసీ లే అవుట్‌లో థర్డు ఆప్షన్ నమూనా ఇళ్లను నిర్మిస్తున్నారు. ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఆర్థిక సాయం చేస్తుండగా రూ.35వేలు లబ్ధిదారులు భరించాల్సి ఉంది. డ్వాక్రా సంఘాలల్లో ఉన్న మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు సులభంగా వస్తున్నాయి. అయితే మిగిలిన లబ్ధిదారులు రూ.35వేలు సమకూర్చుకోలేక పోవడంతో ఇళ్ల నిర్మాణాలకు జాప్యం అవుతోంది. దాంతో మెప్మా, డీఆర్‌డీఏ అధికారుల సహాయంతో సామర్లకోట ఈటీసీ లేవుట్‌లో ఇళ్ల స్థలాలు పొంది, థర్డ్ ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు వస్తున్న వారికి బ్యాంకుల నుంచి రూ.35 వేలు రుణం ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు.

జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతీ పాడిరైతుకు లాభం చేకూరాలనే ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేసిందని స్థానిక పశుసంవర్ధక అధికారి శ్రీమన్నారాయణ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రం వద్ద మంగళవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కేంద్రాలకు అందించిన సామగ్రి, పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు మద్దతు ధర కల్పించాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతీ గ్రామంలో పాల సేకరణకు మహిళా సమాఖ్య సభ్యుల ద్వారా శ్రీకారం చుట్టామన్నారు. మండలంలో 13గ్రామాలకు గానూ 10 గ్రామాల్లో పాల సేకరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజూ కేంద్రాల ద్వారా 160 లీటర్ల పాలను కొనుగోలు చేయాలని సూచించారు. ముఖ్యంగా పాలవెల్లువకు సంబంధించి ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి బృంద కార్యదర్శులు రైతుల వద్దకు వెళ్లి వారి పాడి వివరాలను తెలుసుకోవాలన్నారు.

పంటపొలాల్లో లారీ బోల్తా



పిఠాపురం బైపాస్ రోడ్డులో పంటపొలాల్లో బోల్తాపడిన లారీ

పిఠాపురం: పిఠాపురం బైపాస్‌రోడ్డులో పంటపొలాల్లోకి లారీ మంగళవారం దూసుకుపోయింది. కత్తిపూడి వైపు నుంచి గ్రావెల్ లోడుతో కాకినాడ వైపు వెళ్లుతున్న లారీ రాపర్తి జంక్షన్ దాటిన తర్వాత అదుపు తప్పింది. పంట పొలాల్లోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లు లారీలో ఇరుక్కుపోగా హైవే పోలీసులు, ఇతర వాహనదారులు వచ్చి వారిని కాపాడారు. వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లారీ డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని వేగంగా నడపడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలి

సామర్లకోట: సచివాలయ కార్యదర్శులు సాంకేతిక నైపుణ్యంపై ఆసక్తి కలిగి ఉండి, దానిపై దృష్టి సారించాలని న్యూఢిల్లీకి చెందిన టీసీఐఎల్ సీనియర్ ఫ్యాకల్టీ శ్రీకైలాస్ అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ జిల్లాలోని కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగర పంచాయతీలోని సచివాలయ కార్యదర్శులకు మంగళవారం సోషల్ మీడియా, డిజిటల్ వ్యవస్థపై శిక్షణ నిర్వహించారు. బుధవారంతో వీరి శిక్షణ ముగియనుంది.

మహా ధర్నా రేపు

పిఠాపురం: పంచాయతీ నిధులు మళ్లించడంపై 10వ తేదీన కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే మహా ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గండి కొండలరావు అన్నారు. పిఠాపురం మండలంలో మంగళవారం నాయకులు పర్యటించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలరావు, రవికిరణ్ పాల్గొన్నారు.

సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా రమేష్

కాకినాడ లీగల్: సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్ పై సి.రమేష్‌ను నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఏలూరు డీఐజీ అబ్రహం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురులో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ రమేష్‌ను సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్ బదిలీ చేశారు. ఇటీవల సర్పవరం సబ్ రిజిస్ట్రార్ వీవీఎల్ నరసింహారావు ఒక ఆస్తి విలువ పెంపు వివాదంలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.వెంకటేష్ ఇప్పటి వరకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. తాజాగా రమేష్‌ను డిప్యూటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

ఓటు విలువ పెంచేలా

- చురుగ్గా ఓటరు జాబితాలో సవరణలు
- రాజకీయ పార్టీల సహకారంతో సర్వే
- ఈ నెల 28 నాటికి తుది జాబితా సిద్ధం





ఇంటింటా ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ (ఫైల్)

కాకినాడ సిటీ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. కచ్చితమైన ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకునేలా, అతని ఓటుకు నిఖార్సైన విలువ ఏర్పడేలా అధికారులు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా బూత్ లెవెల్ అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు.

విస్తృత అవగాహన

ఓటర్ల సవరణ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు కృతికా శుక్లా, ఇలక్కియలు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో సహకరించాలని వారు ప్రజలను కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలన్నారు.

గడువులోగా..

ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ అందించారు. వీరికి బీఎల్‌వో ఓటరు యాప్ (వెర్షన్ 4.7) అందజేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం, యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన వారు దరఖాస్తు నింపి బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఈనెల 21 నుంచి మొదలైన ఓటర్ల సవరణ కార్యక్రమం ఆగస్టు 21 వరకు పరిశీలించి పూర్తి చేస్తారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ అనుసంధానం చేసేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. వెరిఫికేషన్ అనంతరం ఆగస్టు 28 నాటికి పారదర్శకమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా సిద్ధమవుతుంది.

పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

పెద్దాపురం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,10,082 ఉండగా, పురుషులు 1,03,896, మహిళలు 1,06,174, ఇతరులు 12 మంది ఉన్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,837 ఉండగా, పురుషులు 1,19,131, మహిళలు 1,17,701, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలి



ఇంటింటా సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి. బీఎల్వోలు మీ ఇంటికి వచ్చినప్పుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు చిరునామా, వయస్సు, ఆధార్, ఇతర వివరాలు సరి చేసుకోవాలి. ఫొటో చక్కగా లేకపోతే అక్కడికక్కడే ఫొటోను అప్‌డేట్ చేసుకోవాలి. పారదర్శక జాబితా పొందేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలి.

– డి.శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌ఓ, కాకినాడ జిల్లా

జిల్లా అభివృద్ధికి ఆదేశాలు ఇవ్వండి

సీఎం జగన్‌కు ఎంపీ గీత వినతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎంపీ గీత

పిఠాపురం: కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమైన అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు, ఆదేశాలు ఇవ్వాలని ఎంపీ వంగా గీత సీఎం జగన్‌ను కోరారు. మంగళవారం ఆమె రాజమహేంద్రవరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పలు అంశాలను సీఎంకు వివరించారు. తుని రైల్వే టన్నెల్ అంచనాలు, గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ఆమె కోరారు. వీటితో పాటు మరికొన్ని అంశాలను కూడా ఆమె సీఎంకు వివరించారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజా సమస్యలు వింటున్న దొరబాబు

పెద్దాపురం : ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో 1, 2 వార్డుల పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. అలాగే అక్కడి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్ విడదాసరి రాజా, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల కృష్ణ ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, చింతా శ్రీనివాసరావు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గలగల సాగుతోంది తూటేరిలా..

- తొలగించిన తూడు, గుర్రపుడెక్క
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సాక్షి ఇంపాక్ట్



తూటేరు డ్రైనులో పారుతున్న సాగునీరు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం తూటేరు డ్రైనులో ఎట్టకేలకు గుర్రపు డెక్క, తూటికాడ తొలగించారు. దీంతో 800 ఎకరాల రైతులకు ముంపు సమస్య నుంచి పరిష్కారం లభించింది. ఈ ముంపు సమస్యపై పలుమార్లు సాక్షిలో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ కథనాలకు స్పందించిన కలెక్టర్ కృతికా శుక్లా రూ.1.95 లక్షలు గుర్రపు డెక్క, తూటికాడ తొలగించడానికి నిధులు మంజూరు చేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాల వల్ల బురదమయమైన పొలాల్లో నుంచి పొక్లెయిన్లు వెళ్లడానికి వీలు చిక్కలేదు. దీంతో వర్షాలు తెరిపి నిచ్చాక ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో గ్రామంలోని రైతు సంఘం నాయకుల పర్యవేక్షణలో గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు పనులు పూర్తి చేసుకున్నారు.

ఓటర్ల సర్వేకు సహకరించండి

ఆర్డీవో జేఎస్ రామారావు



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు మరింత సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే మరింత వేగవంతం చేసినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై ఆపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఫారం-8, 6లు బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటి వరకు ఫారం-6కు సంబంధించి 158 దరఖాస్తులు, ఫారం-7కు 59 దరఖాస్తులు, ఫారం-8కు 179 దరఖాస్తులు అందాయన్నారు. దీనికి సంబధించి పూర్తి విచారణ, రీ సర్వేను వేగవంతం చేసినట్టు తెలిపారు. అనంతరం రీ సర్వే విధానంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ వి.జితేంద్ర, టీపీఓ ఉమా మహేశ్వరరావు, ఎన్నికల డీటీ కాంతారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, (వైఎస్సార్ సీపీ), ఎలిశెట్టి నాని (టీడీపీ) చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ) లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

చైర్‌పర్సన్‌కు కౌన్సిలర్ల వినతిపత్రం



అత్యవసర సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో మంగళవారం చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు కౌన్సిలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. 13వ వార్డు కౌన్సిలర్ వడిశెల అనంతలక్ష్మి మాట్లాడుతూ 27 ఆగస్టు 2022లో తన భర్త సత్తిబాబు ప్రభుత్వ స్థలం ఆక్రమణపై 5వ సచివాయంలోని స్పందనలో ఫిర్యాదు చేసినా కమిషనర్ నేటికీ చర్యలు చేపట్టలేదన్నారు. సర్వే నంబర్ 579లో 1.5ఎకరాలు ప్రభుత్వ రికార్డులో గ్రామ కంఠం భూమిగా నమోదయి ఉంది. దీనిపై కొందరు పన్నులు వేయించుకుని హక్కు పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండు చేశారు. ఎమ్మార్వో, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసి అన్యాక్రాంతం కాకుండా నిరోధించాలన్నారు. సదరు భూమిపై ఏవిధమైన పన్ను లేకుండా నిలుపుదల చేయాలని డిమాండు చేశారు. దీనికి సంబంధించి 10మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు చైర్ పర్సన్‌కు వినతి పత్రం అందించారు.

శతశాతం లక్ష్యాలు సాధించాం

- ఒకే ఏడాదిలో రెండు స్వర్ణ పతకాలు కైవసం
- రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఒక సంవత్సరంలో రెండు సార్లు స్వర్ణ పతకం సాధించిన ఘనత మన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా బ్రాంచ్‌కు దక్కిందని సొసైటీ జిల్లా బ్రాంచ్ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది నిర్ణయించిన లక్ష్యాలను నూరుశాతం సాధించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఐ బ్యాంకుకు చాలా డిమాండ్ ఉందని, రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా జిల్లాలోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంలో ఒక ఐ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు రూ. 45 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. జిల్లాలో మోడల్ చైల్డ్ కేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రూ.1.30 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోస్తాలోని ఏడు మండలాల్లోని యువతకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంక్ క్వాలిటీ ఇంప్రూవ్ చేయడానికి అక్రిడిటేషన్ పొందడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. పెద్దాపురం డివిజన్‌కు ప్రత్యేక రెడ్‌క్రాస్ బ్రాంచ్ ఏర్పాటు చేసి దాని ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం కూడా అవార్డులు వచ్చేలా సామాజిక సేవలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. యువతను ఎక్కువగా సభ్యులుగా చేర్చుకోవాలని అన్నారు. రెడ్‌క్రాస్ సంస్థకు నిధులు సమకూర్చిన సంస్థలు ఓఎన్‌జీసీ, దేవి ఫిషరీస్, కాకినాడ సీపోర్టు ప్రతినిధులను కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించారు. కాకినాడ జిల్లా బ్రాంచ్ చైర్మన్ వైడీ రామారావు సంస్థ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను సభ్యులకు వివరంచారు. గత సంవత్సరం బడ్జెట్ ఖర్చు చేసిన నిధులు ఆమోదం, ఈ సంవత్సరానికి అంచనాలు రూపొందించి వాటిని సభ్యులతో ఆమోదింప చేయడం జరిగిందన్నారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ బాలకృష్ణ, కార్యదర్శి శివకుమార్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతో సివిల్స్‌లో రాణింపు

కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

కాకినాడ: కృషి, పట్టుదల, సరైన ప్రణాళిక ఉంటే సివిల్స్‌లో రాణించడం కష్టం కాదని రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పేదరికం నుంచి ఎంతో మంది సివిల్స్‌లో రాణించడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన అవేర్‌నెస్ ఆన్ సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో పాటు అవసరమైన పుస్తకాలను అధ్యయనం చేయడం, సీనియర్ల అభిప్రాయాలను పంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయో వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నషాముక్త్ భారత్' గురించి వివరించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ పావని గణపతిరాజు పర్యవేక్షణలో జరిగిన ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి, ఐక్యూ కో-ఆర్డినేటర్ వసంతలక్ష్మి, ఫిజిక్స్ లెక్చరర్లు సూర్యదేవర, కస్టమ్స్ సూపరిటెండెంట్లు సతీష్ సింగ్, శివకుమార్, ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అవసరం

కాకినాడ సిటీ: పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో ఆర్.రమేష్ అధ్యక్షతన కలెక్టరేట్ కోర్టు హాలులో నిర్వహించారు. వాతావరణంలోని మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడం, సురక్షితమైన ఆహారం, నీరు, గాలి, నిత్యం సమాజంలో మానవునికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో జిల్లా కమిటీ పని చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, వినీల, బి.రవి పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన

కొత్తపల్లి: ఓటర్ల జాబితా పరిశీలన పక్కాగా నిర్వహిస్తామని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను మంగళవారం పరిశీలించారు. బీఎల్‌ఓలు పూర్తి స్థాయిలో సర్వే చేయాలని ఆదేశించారు. ప్రతీ ఓటరును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటికీ సర్వే పక్కాగా జరుగుతోందన్నారు. ముఖ్యంగా నకిలీ ఓటర్లను గుర్తించాలన్నారు.

బోణీ కాని నామినేషన్

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ పంచాయతీ 5వ వార్డు సభ్యుని ఎన్నికకు మంగళవారం పంచాయతీలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఈఓపీఆర్డీ భాస్కరరావు తెలిపారు. 10తేదీ సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 11న నామినేషన్‌ల స్రూట్నీ, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 19 ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పోలింగ్, అదేరోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు అనంతరం విజేతను ప్రకటిస్తామన్నారు.

వ్యక్తిపై నలుగురి దౌర్జన్యం

కరప: రాత్రి వేళ ఇక్కడ ఏంచేస్తున్నారని ప్రశ్నించినందుకు ఒకవ్యక్తిపై నలుగురు దౌర్జన్యం చేసి, పరారయ్యారు. పెనుగుదురులోని దేవుడు కాలనీకి చెందిన నులికుర్తి మధుసూదనరావు సోమవారం రాత్రి ఇంటికి వెళుతుండగా ఒక ప్రైవేటు ఫిజియోథెరపీ కళాశాల సమీపంలో రోడ్డుపక్కన మోటార్ బైక్‌పై స్త్రీ, పురుషులు ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతరాత్రి సమయంలో రోడ్డుపై ఏంచేస్తున్నారని మహిళను మధుసూదనరావు ప్రశ్నించాడు. దీంతో ఆ వ్యక్తి మధుసూదనరావుపై దౌర్జన్యానికి దిగాడు. ఇంతలో పక్కనున్న స్త్రీ ఎవరికో ఫోన్ చేయగా మరో ఇద్దరు యువకులు వచ్చి ఆ దాడిలో పాలుపంచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీస్, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ శిశువుల పట్ల వివక్షతో జరిగే భ్రూణహత్యలను నివారించడంతో పాటు గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు మొత్తం 104 ఉన్నాయని, దీనిలో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. గత ఏప్రిల్ నుంచి జులై వరకు 24 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 79 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసినట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించి బోర్డులను, వాల్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆయన కోరారు.

ధ్యానంతో ఏకాగ్రత వృద్ధి

నాగమల్లితోట జంక్షన్: ధ్యానం ఏకాగ్రతను పెంచుతుందని ప్రణవ ఆశ్రమ నిర్వాహకులు సుమిత్రానంద సరస్వతీ మాతాజీ అన్నారు. స్థానిక రామారావు పేటలోని నారాయణ పాఠశాలలో మంగళవారం మాతాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాజీని పాఠశాల తరపున దుశ్శాలువా కప్పి, పండ్ల బొకేతో సత్కరించారు. నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు, స్టేట్ కో-ఆర్డినేటర్ సుంకరమూర్తి పాల్గొన్నారు.



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఎంపీ గీత

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు ఎంపీ గీత అభినందన

కాకినాడ రూరల్: ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికైన కాకినాడ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను ఎంపీ వంగా గీత అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటాలన్నారు. వలసపాకల పాఠశాలలో చదువుతున్న వారు హైదరాబాద్‌లో జరిగిన హాకీ, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, స్కేటింగ్ పోటీలలో ప్రతిభ చూపి ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ బి.శేఖర్, పీఈటీ టి.అశోక్‌కుమార్ ఎంపీ గీతకు పరిచయం చేశారు. కాకినాడకు పేరొచ్చేలా ఆటలు ఆడాలని ఆమె విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో వంగా విశ్వనాథ్, రావుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.